ఆకాశవాణి కేంద్ర మాజీ నిర్దేశకుడు

వేణుగోపాల్‌రెడ్డి కన్నుమూత

చెన్నై, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆకాశవాణి కేంద్ర మాజీ నిర్దేశకుడు ఎస్.వేణుగోపాల్‌రెడ్డి (84) కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా వృద్ధాప్య సమస్యలతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం వేకువజామున స్థానిక జవహర్‌నగర్‌లోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థివదేహానికి మంగళవారం సాయంత్రం అంత్యక్రియలు ముగిశాయి. వేణుగోపాల్‌రెడ్డి లయోలా కళాశాలలో బీఏ అనంతరం లా కాలేజీలో ఎల్‌ఎల్‌బీ పట్టా పొందారు. ఆలిండియా రేడియోలో ఉద్యోగంలో చేరాక ధార్వాడ్, పాండిచ్చేరి, తిరుచ్చి, ముంబై, చెన్నై కేంద్రాల్లో పని చేశారు. ఆంగ్ల, తెలుగు భాషల్లో అనర్గళంగా మాట్లాడగల వక్త. ఆకాశవాణి చెన్నై కేంద్రంలో కార్యనిర్వాహకుడిగా వృత్తి నిర్వహించినప్పుడు గుమ్మడి, సూర్యకాంతం, షావుకారు జానకి, వంకాయల సత్యనారాయణ, సావిత్రి, పి.సుశీల, ఎస్.జానకి, డాక్టర్ సాయికృష్ణ యాచేంద్ర, మంగళంపల్లి బాలమురళీకృష్ణ వంటి దిగ్గజాలతో పలు కార్యక్రమాలు రూపొందించారు. నగరంలోని తెలుగు ప్రముఖులంతా ఆయనకు సన్నిహితులే. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తె ప్రవీణ అమెరికాలో ఉంటుండగా, చిన్నకుమార్తె ప్రశాంతి దంతవైద్యురాలు. కాగా వేణుగోపాల్‌రెడ్డి మృతి పట్ల జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, తమిళనాడు తెలుగు సాంస్కృతిక సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తమ్మినేని బాబు, పీఆర్ కేశవులు, ద్రావిడదేశం అధ్యక్షులు వి.కృష్ణారావు, అఖిలభారత తెలుగు సమాఖ్య వ్యవస్థాపకులు డాక్టర్ సీఎంకే రెడ్డి, టామ్స్ వ్యవస్థాపకులు గొల్లపల్లి ఇశ్రాయేలు తదితరులు తీవ్ర సంతాపం ప్రకటించారు.



వేణుగోపాల్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)



వేణుగోపాల్‌రెడ్డి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ సీఎంకే రెడ్డి

ప్రత్యక్ష నియామకాలు

• క్రీమీ లేయర్ విధానం రద్దు చేయాలి

సామాజిక న్యాయంపై దాడే !

• సీఎం స్టాలిన్ ట్వీట్



యువతికి ఉద్యోగ నియామకపత్రం అందజేస్తున్న సీఎం

చెన్నై, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ అధీనంలోని ఉన్నత పదవుల్లో ప్రత్యక్ష నియామకాల విధానం అమలు చేయడాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్రంగా ఖండించారు. ఇది సామాజిక న్యాయంపై దాడివంటిదని ఆయన పేర్కొన్నారు. ఇదే విషయంపై ఆయన తన ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లోని ఉన్నత పదవుల భర్తీలో ప్రత్యక్ష నియామకాల(లేటరల్ ఎంట్రీ) విధానం సామాజిక న్యాయంపై దాడి వంటిదన్నారు. అర్హత కలిగిన షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులాలు, బీసీ, ఎంబీసీ, మైనార్టీలకు చెందిన అధికారులకు ఉన్నత పదవులను అధిరోహించే అవకాశం చేజారిపోతుందని, అందువల్ల కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. అలాగే, ఉన్నత పదవుల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు సీనియారిటీ ప్రకారంగా భర్తీ చేసేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన అధికారులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ప్రారంభం నుంచే తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్న క్రీమీ లేయర్ విధానానికి స్వస్తి చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దీనికంటే ముందుగా కొన్నేళ్లుగా పెంపునకు నోచుకోని క్రీమీ లేయర్ పరిమితిని పెంచాలన్నారు. అన్నిటికంటే ముఖ్యంగా దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని సీఎం స్టాలిన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

1,646 మందికి ఉద్యోగ నియామక పత్రాలు

హిందూ దేవాదాయ ధర్మాదాయ శాఖ, వైద్య, ప్రజా సంక్షేమ ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎంపిక చేసిన 1,646 మందికి ఉద్యోగ నియామక ఉత్తర్వులను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మంగళవారం అందజేశారు. సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ ఉద్యోగ నియామక పత్రాలను అందుకున్న వారిలో దేవాదాయ శాఖలో 172 మంది అసిస్టెంట్లతో కలిసి మొత్తం 693 మంది ఉండగా, వైద్య, ఆరోగ్య శాఖల్లో 946, 528, ఇతర శాఖల్లో మరో ఏడుగురు ఉన్నారు.

రాజీవ్ గాంధీకి ఘననివాళి



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సెల్వపెరుందగై, సీనియర్ నేతలు

ప్యారీస్, ఆగస్టు 20: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 80వ జయంతి వేడుకలను తమిళనాడు కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు రాజీవ్ విగ్రహాలు, ఆయన చిత్రపటాలకు నివాళులర్పించి, అన్నదానం, వస్త్రదానం కార్యక్రమాలు నిర్వహించారు. రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో అలంకరించిన రాజీవ్ చిత్రపటానికి టీఎన్‌సీసీ అధ్యక్షులు సెల్వపెరుందగై పూలు చల్లి నివాళులర్పించారు. సీనియర్ నేతలు తంగబాలు, తిరునావుక్కరసు, అసెంబ్లీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ రాజేష్‌కుమార్, ఎంపీ విజయ్‌వసంత్, ప్రధాన కార్యదర్శులు రంగభాష్యం, స్వర్ణ సేతురామన్, ఇలభాస్కర్ తదితరులు నివాళులర్పించారు. అనంతరం సైదాపేట జంక్షన్‌లో ఉన్న రాజీవ్ విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలసి నివాళులర్పించిన సందర్భంగా సెల్వపెరుందగై మాట్లాడుతూ... రాష్ట్రంలో రైల్వే పథకాలకు కేంద్ర ప్రభుత్వం రూ.1,000 కోట్లు మాత్రమే మంజూరు చేసిందని, దీనిని ఖండిస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత 23న రాష్ట్ర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీకి రూ.1,001 మనియార్డర్ చేయనున్నట్లు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో, ఫలితాలు ప్రకటించాక దివంగత మాజీ ముఖ్యమంత్రి కలైంజర్ కరుణానిధిని కించపరిచేలా వ్యాఖ్యానించిన బీజేపీతో సీఎం స్టాలిన్ చేతులు కలపరన్నారు. మతవాదాన్ని వ్యతిరేకించడంలో ఎట్టి పరిస్థితుల్లోను కాంగ్రెస్ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని సెల్వపెరుందగై తెలిపారు.

పశుసంవర్ధక శాఖ వాహనాలపై

ప్రధాని మోదీ చిత్రం

పెరంబూర్, ఆగస్టు 20: స్థానిక సచివాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ చేపట్టిన పలు పథకాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. కార్యక్రమంలో 200 సంచార వాహనాలను సీఎం ప్రారంభించారు. ఈ వాహనాలన్నింటిలో స్టాలిన్ చిత్రంతో పాటు ఆవుకు ప్రధాని నరేంద్ర మోదీ మేత అందించే చిత్రం కూడా ఉంది. ఇప్పటికే, కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్న దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి స్మారక నాణేం ప్రారంభోత్సవంలో బీజేపీ-డీఎంకే మధ్య సాన్నిహిత్యానికి దారితీసిందని వార్తలు వెలువడుతున్నాయి. అలాగే, డీఎంకేకు బీజేపీకి రహస్య సంబంధాలున్నాయని ప్రతిపక్ష నేత, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు. ఈ ఆరోపణలను ముఖ్యమంత్రి స్టాలిన్ ఖండించారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా పశువులకు వైద్యచికిత్సలందించేలా ప్రారంభించిన సంచార వాహనాల్లో ప్రధాని చిత్రం చోటుచేసుకోవడం గమనార్హం. కాగా, ఈ వాహనాల పథకానికి కేంద్రప్రభుత్వం నిధులు అందజేస్తుందని అందువల్లే ప్రధాని చిత్రపటం ఉంచినట్లు సచివాలయ వర్గాల సమాచారం.



వాహనంపై సీఎం చిత్రంతో పాటు ఏర్పాటైన ప్రధాని మోదీ చిత్రం

నేటినుంచి విమానాశ్రయంలో

ఎంపాక్స్ స్క్రీనింగ్

• ఏర్పాట్లు సిద్ధం • ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రహ్మణ్యం



అడయార్, ఆగస్టు 20: చెన్నైతో పాటు రాష్ట్రంలోని విమానాశ్రయాల్లో ఆఫ్రికా తదితర దేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు మంకీ పాక్స్ (ఎం-పాక్స్) స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నారు. ఇదే విషయంపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రహ్మణ్యం మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ... గత కొన్ని రోజులుగా ఆఫ్రికా దేశాల్లో మంకీ పాక్స్ వైరస్ వ్యాపిస్తోందని తెలిపారు. ఆ దేశాల నుంచి వచ్చే ప్రయాణికుల ద్వారా ఈ వైరస్ వ్యాప్తి చెందే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎయిర్‌పోర్టుల్లో ఈనెల 21నుంచి నుంచి స్క్రీనింగ్, స్కానింగ్ పరీక్షలను నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ మంకీపాక్స్ వ్యాప్తిపై ఇప్పటికే ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక చేసిందని, అలాగే, కేంద్రం కూడా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను అప్రమత్తం చేసిందన్నారు. దీంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉంటూ మంకీ పాక్స్ వైరస్ రాష్ట్రంలో వెలుగు చూడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. ఇందులోభాగంగా ఎయిర్‌పోర్టుల్లో ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులను నిశితంగా స్క్రీనింగ్, స్కానింగ్ చేస్తామన్నారు. ముఖ్యంగా ఆఫ్రికా దేశాల నుంచి రాష్ట్రానికి ప్రత్యక్ష విమాన సర్వీసులు లేకపోయినప్పటికీ వివిధ దేశాల నుంచి వచ్చే వారిని గుర్తించి వారికి ఈ పరీక్షలు చేస్తామన్నారు. ఇందులో ఎంపాక్స్ లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి తరలిస్తామన్నారు. ఈ వైరస్ సోకిన 5 నుంచి 21 రోజుల్లో ఈ లక్షణాలు బయటపడతాయన్నారు. శరీరంపై అమ్మోరు వస్తే ఎలా దద్దుర్లు వస్తాయో అలా ఉంటాయన్నారు. వీటితో పాటు జ్వరం, తుమ్ములు, శరీర నొప్పులు నాలుగు వారాల పాటు ఉంటాయన్నారు. ముఖ్యంగా గర్భవతులు, చిన్నారులు, వృద్ధులు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడేవారు జాగ్రత్తగా ఉండాలని మంత్రి సుబ్రహ్మణ్యం వెల్లడించారు.

• రూ.525 కోట్ల మోసం వ్యవహారం

దేవనాథన్ యాదవ్ బ్యాంక్ ఖాతాల స్తంభన

ప్యారీస్, ఆగస్టు 20: స్థానిక మైలాపూర్‌లోని హిందూ పర్మినెంట్ ఫండ్ సంస్థ పేరుతో రూ.525 కోట్లు మోసం కేసులో అరెస్టయిన ఇండియా మక్కల్ కల్వి మున్నేట్ర కళగం వ్యవస్థాపకుడు దేవనాథన్ యాదవ్ బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేసినట్లు కేంద్ర ఆర్థిక నేర విభాగ పోలీసులు తెలిపారు. మైలాపూర్ దక్షిణ మాడవీధిలో 150 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ సంస్థలో సుమారు 5,000 మందికి పైగా ఖాతాదారులు రూ.లక్ష నుంచి రూ.5 కోట్ల వరకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేశారు. ఈ సంస్థలో వివిధ సేవింగ్స్ పథకాలు, మెచ్యూరిటీ తీరిన డిపాజిట్లు తిరిగి చెల్లించకపోవడంతో పాటు రూ.525 కోట్లకు పైగా దేవనాథన్ యాదవ్ మోసం చేసినట్లు ఆరోపణలున్నాయి. వీటి పై విచారణ జరిపిన కేంద్ర ఆర్థిక నేర విభాగం పోలీసులు ఆదివారం ఒకే సమయంలో దేవనాథన్‌కు సంబంధాలున్న 12 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇందు లో దేవనాథన్ మోసాలు వెలుగుచూడడంతో సంబంధిత ఫైనాన్స్ సంస్థ ప్రధాన కార్యాలయం, ఆయన నిర్వహణలోని టీవీ ఛానల్ భవనాన్ని సీజ్ చేశారు. అలాగే, దేవనాథన్ పేరుతో ఉన్న ఐదు బ్యాంక్ ఖాతాలు కూడా స్తంభింపజేశారు. ఈ భారీ మోసం కేసులో మరికొన్ని వాస్తవాలను వెలికి తీయడానికి దేవనాథన్‌ను తమ కస్టడీలోకి తీసుకొనే ప్రయత్నాలు పోలీసులు చేపట్టారు.

రాష్ట్రాభివృద్ధికి పదేళ్లలో రూ.11 లక్షలిచ్చాం

• ఒండివీరన్ వర్ధంతి సభలో కేంద్రమంత్రి మురుగన్

ప్యారీస్, ఆగస్టు 20: స్వాతంత్ర్య సమరయోధుడు, అరుంధతీయుల ముద్దుబిడ్డ ఒండివీరన్ పగడై 253వ వర్ధంతి సందర్భంగా మంగళవారం తిరునల్వేలి జిల్లా పాళయంకోటలోని ఆయన మణిమండపంలో పలువురు నేతలు ఘననివాళులర్పించారు. రాష్ట్రప్రభుత్వం తరఫున స్పీకర్ అప్పావు నేతృత్వంలో అటవీ శాఖ మంత్రి మదివేందన్, ఎంపీలు కనిమొళి, అందియూర్ సెల్వరాజ్ తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కనిమొళి మీడియాతో మాట్లాడుతూ... దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి నేతృత్వంలోని ప్రభుత్వం అరుంధతీయులకు 3 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు స్వాతంత్ర్య సమరయోధుడు ఒండివీరన్‌కు మణిమండపం నిర్మించి ఆయనకు గుర్తింపు తెచ్చారన్నారు. అణగారిన వర్గాలకు న్యాయం చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి స్టాలిన్ వారి హక్కులతో పాటు రాష్ట్ర హక్కుల కోసం పోరాడుతూనే ఉన్నారన్నారు. అందరికీ విద్య, మెట్రోరైలు, వరదల్లో తీవ్రంగా నష్టపోయిన చెన్నై, తూత్తుకుడి ప్రాంతాలకు కేంద్రప్రభుత్వం ఎలాంటి నిధులు కేటాయించలేదని, రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమ చూపుతున్న బీజేపీకి దగ్గర అవ్వాల్సిన దుస్థితి డీఎంకేకు లేదన్నారు.

రూ.11 లక్షల కోట్లిచ్చాం: మురుగన్

ఒండివీరన్ పగడై విగ్రహానికి నివాళులర్పించిన సందర్భంగా కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ మీడియాతో మాట్లాడుతూ... తమిళనాడు రాష్ట్రాభివృద్ధి కోసం పదేళ్లలో రూ.11 లక్షల కోట్లను కేంద్ర ప్రభుత్వం అందజేసిందన్నారు. యేటా రాజ్‌భవన్‌లో స్వాతంత్ర్య దినం సందర్భంగా ఎట్ హోం నిర్వహించడం ఆనవాయితీ అని, ఈ సారి డీఎంకే ప్రభుత్వం తరపున సీఎంతో పాటు మంత్రులు కూడా పాల్గొన్నారన్నారు. దీనిని కొన్ని పార్టీలు రాజకీయంగా చూడడం సరికాదన్నారు. మూడేళ్ల క్రితం ప్రధాని నరేంద్రమోదీ ఉత్తర్వుల మేరకు విప్లవ వీరుడు ఒండివీరన్‌కు పోస్టల్ స్టాంప్ ఆవిష్కరించి కేంద్రప్రభుత్వం ఘనత చేకూర్చిందన్నారు. వెనుకబడిన జిల్లా తూత్తుకుడిలో మరింత అభివృద్ధి జరగాలన్న దృష్టితోనే కులశేఖరపట్టినంలో రాకెట్ ప్రయోగ కేంద్రం, వీఓసీ హార్బర్ అభివృద్ధికి కూడా కేంద్ర ప్రభుత్వం తమ వంతు సాయం అందించిందన్నారు.



ఒండివీరన్‌కు మంత్రి మురుగన్ నివాళి

ఓపీఎస్ నివాళి...

అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఒండివీరన్‌కు నివాళులర్పించారు. సేలం సమీపంలోని నెడుంజాలై నగర్‌లో ఉన్న ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన ఒండివీరన్ చిత్రపటానికి పార్టీ నేతలతో కలసి పూలు చల్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆంగ్లేయులను మొట్టమొదటి సారిగా ఎదిరించి చరిత్రలో నిలిచిన మహా యోధుడు ఒండివీరన్ వర్ధంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అరుంధతీయులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పును పూర్తిస్థాయిలో అమలు పరచాలని డిమాండ్ చేశారు.

ఎమ్మార్పీఎస్...

తిరునల్వేలి జిల్లా పాళయం కోటలో ఉన్న మణిమండపంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) రాష్ట్ర అధ్యక్షులు లోకేష్ కుమార్ అధ్యక్షతన రాష్ట్ర, జిల్లా నిర్వాహకులు ఒండివీరన్ విగ్రహానికి పూల దండలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మణిమండపం ప్రాంగణంలో నిర్వహించిన గురుపూజలో పాల్గొని పేదలకు అన్నదానం చేశారు.



ఒండివీరన్ మణిమండపంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు లోకేష్‌కుమార్, నిర్వాహకుల నివాళి



ఒండివీరన్‌కు స్పీకర్ అప్పావు, ఎంపీలు కనిమొళి, సెల్వరాజ్ తదితరుల నివాళి

బీజేపీ వ్యతిరేక కూటమిలో ఉంటాం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణన్

అడయార్, ఆగస్టు 20: భారతీయ జనతా పార్టీతో ఏ పార్టీ పొత్తు పెట్టుకున్నప్పటికీ తాము మాత్రం బీజేపీని వ్యతిరేకించే కూటమిలోనే ఉంటామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కే బాలకృష్ణన్ స్పష్టం చేశారు. ఇదే విషయంపై ఆయన తిరువారూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ... ఆస్తి పన్ను పెంపు తదితర ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ఖండిస్తూ ఈ నెల 28వ తేదీన చెన్నై నగర పాలక సంస్థకు వ్యతిరేకంగా ధర్నా చేయనున్నట్టు ఆయన తెలిపారు. దివంగత నేత కరుణానిధి శతజయంతి స్మారక నాణెంను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని కేంద్రం ఆగమేఘాలపై ఆమోదం తెలిపిందన్నారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం కోరే నిధులను మాత్రం ఇవ్వడం లేదని ఆయన గుర్తు చేశారు. ఏదిఏమైనా తాము మాత్రం బీజేపీ వ్యతరేక కూటమి వైపే ఉంటామని స్పష్టం చేశారు.

సమాచార దర్శిని

23న ఎంఎన్ఎం కార్యవర్గ సమావేశం

పెరంబూర్, ఆగస్టు 20: మక్కల్ నీది మయ్యం కార్యవర్గ సమావేశం ఈ నెల 23వ తేది జరగనుంది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి ఎ.అరుణాచలం ప్రకటన విడుదల చేశారు. ఆళ్వార్‌పేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 గంటలకు పార్టీ అధ్యక్షుడు కమలహాసన్ నేతృత్వంలో జరుగుతుందని, ఈ సమావేశానికి కార్యవర్గ సభ్యులు హాజరుకావాలని ప్రకటనలో తెలిపారు.

24న విద్యార్థులకు వివిధ రకాల పోటీలు

ఐసిఎఫ్, ఆగస్టు 20: తమిళనాడు జవహర్ పిల్లల సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు ఈనెల 24 వ తేది జరగనున్నాయి. 5-8, 9-12, 12 -16 ఏళ్ల విభాగాల్లో గాత్ర సంగీతం, భరత నాట్యం, చిత్రలేఖనం, జానపద నృత్యం వంటి వివిధ రకాల పోటీలు రాజా అన్నామలైపురం డీజీఎస్ దినకరన్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ సంగీత కళాశాల ప్రాంగణంలో జరగనున్నాయి. ఉదయం 9నుంచి పేర్ల నమోదు ప్రారంభమవుతుంది. వివరాలకు నెం.044-28192152లో సంప్రదించవచ్చు.

29న టెన్త్ మార్క్ షీట్

ఐసిఎఫ్, ఆగస్టు 20: టెన్త్ విద్యార్థులకు మార్క్ షీట్లు ఈనెల 29వ తేది అందజేయనున్నట్లు ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్ తెలిపింది. స్టేట్ బోర్డు సిలబస్‌లో టెన్త్ విద్యార్థులకు మార్చి 26 నుంచి ఏప్రిల్ 7వ తేది వరకు నిర్వహించిన పరీక్షలను 9.08 లక్షల మంది రాశారు. మే 10వ తేది పరీక్షా ఫలితాలు విడుదల కాగా, 91.55 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. వీరి ఒరిజినల్ మార్క్ షీట్లు 29వ తేది ఉదయం 10 గంటల నుంచి పాఠశాల హెచ్‌ఎంల ద్వారా, ప్రైవేటు విద్యార్థులకు ఆయా పరీక్షా కేంద్రాల ద్వారా అందజేయనున్నట్లు ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్ తెలిపింది.

29 వరకు చెన్నై ఎగ్జిబిషన్

ఐసిఎఫ్, ఆగస్టు 20: స్థానిక ఎగ్మూర్ మ్యూజియంలో చెన్నై వారోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 29వ తేది వరకు నగర చరిత్ర వివరించేలా ఎగ్జిబిషన్ జరగనుంది. నగర చరిత్రకు సంబంధించిన వస్తువులు ప్రదర్శనలో ఉంచారు. మద్రాసు ప్రెసిడెన్సీలో విడుదలైన నాణేలు, పాత ఫొటోలు వంటివి ఇందులో ప్రదర్శిస్తున్నారు. వీటితో పాటు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తున్నారు. లఘుచిత్రాల పోటీల్లో మొదటి బహుమతిగా రూ.15 వేలు అందజేయనున్నారు.

వారంలో మూడు రోజులు మాత్రమే శ్రీలంకకు నౌకా సేవలు

ఐసిఎఫ్, ఆగస్టు 20: ఈ నెలాఖరు వరకు మంగళ, గురు, ఆదివారాల్లో మాత్రమే శ్రీలంక నౌక రవాణా సేవలుంటాయని ఆ సంస్థ డైరెక్టర్ నిరంజన్ తెలిపారు. భారత్ - శ్రీలంక మధ్య నౌక సేవలు ఈనెల 16వ తేది నాగపట్టినం నుంచి ప్రారంభమయ్యాయి. ఆదివారం 9 మందితో శ్రీలంకకు వెళ్లిన నౌక, అదే రోజు 27 మందితో నాగపట్టినం చేరుకుంది. సోమవారం ఉదయం 8 గంటలకు ఈ నౌక సేవలు హఠాత్తుగా రద్దు చేశారు. ఈ విషయమై సంస్థ డైరెక్టర్ నిరంజన్ మాట్లాడుతూ... రిజర్వేషన్లు లేకపోవడంతో సేవలు రద్దు చేశామన్నారు. ఈ నెల 31వ తేది వరకు వారంలో మంగళ, గురు, ఆదివారాలు మాత్రమే సేవలుంటాయని, ప్రయాణికుల సంఖ్య, రిజర్వేషన్‌ను అనుసరించి డెయిలీ సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.

ట్రాఫిక్ పోలీసులకు టాయిలెట్లు

ఐసిఎఫ్, ఆగస్టు 20: నగరంలో 100 ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసుల సౌకర్యార్థం టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నారు. చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయం ఆధ్వర్యంలో 55 ట్రాఫిక్ పోలీసు స్టేషన్లున్నాయి. వాటి పరిధిలో ఉన్న 284 సిగ్నళ్ల వద్ద విధులు నిర్వహించే పోలీసులు టాయిలెట్లు లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య పరిష్కరించేలా తొలివిడతగా 100 ప్రాంతాల్లో టాయిలెట్ల నిర్మాణపనులు జరుగుతున్నాయి. ఇప్పటివరకు 14 ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఈ టాయిలెట్ పైన 270 లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్, చేతులు శుభ్రం చేసుకొనేలా వాష్‌బేసిన్ ఏర్పాటు చేశారు.

లఘుచిత్రాలకు ఆహ్వానం

ఐసిఎఫ్, ఆగస్టు 20: 'దూరదృష్టి గల ఆలోచనాపరుడు - కలైంజర్' పేరుతో నిర్వహిస్తున్న పోటీలకు ఈనెల 31వ తేది వరకు లఘుచిత్రాలు ఆహ్వానిస్తున్నారు. కలైంజర్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని అక్టోబరు 31వ తేది లఘుచిత్రాల పోటీ జరగనుంది. దీనికి సంబంధించిన లఘుచిత్రాలను shortfilmkalaignar100@gmail.comకు 31వ తేదిలోపు పంపించాలని ప్రభుత్వం తెలిపింది.

ముఖ్యమంత్రి ట్రోఫీ పోటీలకు ఆహ్వానం

ఐసిఎఫ్, ఆగస్టు 20: సెప్టెంబరులో జరగనున్న ముఖ్యమంత్రి ట్రోఫీ పోటీలకు క్రీడాకారులు పేరు నమోదు చేసుకోవాలని ప్రభుత్వం తెలిపింది. జిల్లా, మండలస్థాయిల్లో సెప్టెంబరు 10వ తేది నుంచి జరిగే ఈ పోటీలకు పాఠశాల, కళాశాల విద్యార్థులు, దివ్యాంగులు, ప్రభుత్వ ఉద్యోగులు ఈ నెల 25వ తేది వరకు http-s://sdat.tn.gov.in లో పేరు నమోదు చేసుకోవచ్చు. వివరాలకు నెం.9514000777లో సంప్రదించవచ్చు.

మదురై-చెన్నై విమానంలో తమిళంలో అనౌన్స్‌మెంట్

ఐసిఎఫ్, ఆగస్టు 20: మదురై-చెన్నై విమానంలో అనౌన్స్‌మెంట్ తమిళంలో జరుగుతోంది. మదురై - చెన్నై మధ్య నడిచే ప్యాసింజర్ విమానాల్లో ప్రయాణికులకు సంబంధించిన ప్రకటనలు ఆంగ్లంలో ఉంటున్నాయి. సోమవారం బయల్దేరిన ప్రైవేటు విమానంలో కెప్టెన్ ప్రియన్ విఘ్నేష్ విమానం బయల్దేరే ముందు తమిళంలో అనౌన్స్‌మెంట్ చేశారు. ఎడమ వైపు కూర్చున్న ప్రయాణికులు మీనాక్షి అమ్మవారి ఆలయ సౌకర్యాన్ని వీక్షించవచ్చని తమిళంలో తెలిపారు. ఓ ప్రయాణికుడు ఈ అనౌన్స్‌మెంట్‌ను రికార్డు చేసి సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు.

మహాలయ అమావాస్యకు ఆధ్యాత్మిక రైలు

ఐసిఎఫ్, ఆగస్టు 20: మహాలయ అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక ఆధ్యాత్మిక యాత్ర రైలును ఐఆర్‌సీటీసీ ఏర్పాటు చేసింది. ఈ యాత్రలో కాశి విశ్వనాథ ఆలయం, విశాలాక్షి ఆలయం, అన్నపూర్ణ ఆలయాలను దర్శించుకోవచ్చు. ప్రయాగలో గంగ, యమున, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేయవచ్చు. అయోధ్య రామజన్మభూమిని దర్శించుకోవచ్చు. సెప్టెంబరు 30వ తేది భక్తులు మదురై, దిండుగల్, తిరుచ్చి, విరుదాచలం, విల్లుపురం, చెన్నై ఎగ్మూర్ స్టేషన్లలో ఈ రైలు ఎక్కవచ్చు. 10 రోజుల పర్యటనకు స్లీపర్ (బడ్జెట్) రూ.20,500, త్రీ టైర్ ఏసీ (జనతా) రూ.23,600 ఛార్జీగా నిర్ణయించారు. ప్రభుత్వ అధికారులకు ఎల్టీసీ, ఎల్‌ఎఫ్‌సీ సదుపాయాలున్నాయి. ఇతర వివరాలకు నెం.7305858585లో సంప్రదించవచ్చు.

పశ్చిమ కనుమల ప్రాంతాల్లో భారీవర్షాలు

● అమనలింగేశ్వర స్వామి ఆలయంలో భారీగా వరద నీరు

పెరంబూర్, ఆగస్టు 20: పశ్చిమ కనుమల కొండ ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం కురిసిన భారీవర్షాలతో ఉడుమలై సమీపంలోని పర్యాటక ప్రాంతం తిరుమూర్తిమలైలో వెలసిన అమనలింగేశ్వర స్వామి ఆలయంలో భారీగా వరద నీరు ప్రవేశించింది. ఉడుమలై నుంచి సుమారు 20 కి.మీ దూరంలో తిరుమూర్తిమలై ఉంది. ఇక్కడి అమనలింగేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మ, విష్ణు, శివుడు ముగ్గురు దేవతామూర్తులు కలసి ఉండడం ఆలయ ప్రత్యేకతగా ఉంది. అలాగే, పశ్చిమ కనుమల కొండ ప్రాంతాల్లో ఉన్న ఔషధ మొక్కల మీదుగా ప్రవహించే పంచలింగ జలపాతం వద్ద భక్తులు పెద్దసంఖ్యలో స్నానాలు చేసి, అమనలింగేశ్వరస్వామిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో, సోమవారం సాయంత్రం హఠాత్తుగా ఆలయంలో భారీగా వరద నీరు ప్రవేశించింది. ఆలయ అర్చకులు, ఉద్యోగులు సురక్షితంగా బయటకు చేరుకున్నారు. ఆలయ పూజలు రద్దుచేశారు.



ఆలయాన్ని ముంచెత్తిన వరద

జలకంఠేశ్వర ఆలయంలో పౌర్ణమి గిరి ప్రదక్షిణ

వేలూరు, ఆగస్టు 30: స్థానిక కోటలో జలకంఠేశ్వరుడి ఆలయం ఉంది. ఆలయం చుట్టూ కోట, కోట చుట్టూ నీటితో కలిగిన అగళి ఉంది. కొద్ది సంవత్సరాలుగా హిందూ మున్నని నిర్వాహకులు అధ్యక్షతన కోట చుట్టూ పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ చేసి జలకంఠేశ్వరుడు, అఖిలాండేశ్వరి అమ్మవార్లను దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో, సోమవారం గిరి ప్రదక్షిణలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.



గిరి ప్రదక్షిణలో భక్తులు

గుడియాత్తం ఓటర్లకు ఎంపీ కృతజ్ఞతలు

వేలూరు, ఆగస్టు 20: ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో వేలూరు డీఎంకే అభ్యర్థి కదిర్ ఆనంద్ విజయం సాధించారు. తనను గెలిపించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపేలా ఆయన నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో, గుడియాత్తం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఉల్లి, చిన్నతోటాలమ్, కులిత్తై, కీల్‌పట్టి, వలత్తూరు, ఏరతాంగల్ సహా పలు గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఎంపీ, తనను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట స్థానిక ఎమ్మెల్యే అమ్ములు, పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.



ఎంపీ కదిర్ ఆనంద్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు

మలేసియాలో చిక్కుకున్న కుమారుడిని రక్షించండి

● కలెక్టర్‌కు మహిళ వినతి

వేలూరు, ఆగస్టు 20: మలేసియాలో చిక్కుకున్న తన కుమారుడికి విముక్తి కల్పించాలని ఓ మహిళ జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. పేర్నాంబట్టు సమీపం మేల్‌పట్టి చొక్కబూషి కుప్పానికి చెందిన తమిళ్‌సెల్వి మాట్లాడుతూ... తన కుమారుడు మణికంఠన్ చెన్నైలోని ఓ ప్రైవేటు సంస్థ ద్వారా 2022లో మలేసియాలో ఓ ప్రైవేటు హోటల్‌లో పనికి వెళ్లారన్నారు. ఆ హోటల్ యజమాని తనను ఏడాది కాలంగా వేధిస్తున్నాడని, తాను ఊరికి వచ్చేస్తానని రెండు నెలల క్రితం మణికంఠన్ తనకు ఫోన్ చేశాడని తెలిపింది. అప్పటి నుంచి అతనిని సంప్రదించేందుకు యత్నించగా, సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉందన్నారు. తన కుమారుడిని ఓ చిన్న గదిలో వేసి హింసిస్తున్నట్లు తెలిసిందని, అందువల్ల తన కుమారుడిని విముక్తి చేసి తమకు అప్పగించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు తమిళ్ సెల్వి తెలిపారు.



తమిళ్ సెల్వి

మంగళసూత్రాన్ని విక్రయించి డబ్బులు ఇచ్చా

● ఆర్కాడ్ సురేష్ భార్య

అడయార్, ఆగస్టు 20: తన భర్త ఆర్కాడ్ సురేష్‌ను హత్య చేసిన వారిపై ప్రతీకారం తీర్చుకునేందుకు తన మంగళసూత్రాన్ని విక్రయించి రూ.1.50 లక్షల నగదును తన మరిది పొన్నై బాలుకు ఇచ్చినట్టు ఆర్కాడ్ సురేస్ భార్య పోర్కొడి పేర్కొన్నారు. బీఎస్పీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో పోలీసులు అరెస్టు చేసిన 23 మంది నిందితుల్లో పోర్కొడి ఒకరు. ఆమెను విచారించిన సందర్భంగా పలు ఆసక్తికర విషయాలను వెల్లడయ్యాయి. తన భర్తను హత్య చేసిన వారిపై ప్రతీకారం తీర్చుకోవాలని దశదిన కర్మ రోజున సమాధి వద్ద శపథం చేసినట్టు చెప్పింది. పైగా తన భర్త ఆర్కాడ్ సురేష్ హత్యకు ఆర్మ్‌స్ట్రాంగ్ వివిధ రూపాల్లో సాయం చేసినట్టు తన మరిది పొన్నై బాలు తెలుసుకున్నారని, దీంతో ఆయన హత్యకు తన వంతు సాయంగా తన మంగళసూత్రాన్ని విక్రయించి రూ.1.50 లక్షల ను పొన్నై బాలుకు ఇచ్చానని ఆమె తెలిపింది.

కీలక పార్టీల నేతల ఇళ్ల ముందు పోలీసు భద్రత వెనక్కు

పెరంబూర్, ఆగస్టు 20: కీలక పార్టీ నేతల ఇళ్లకు కల్పిస్తున్న పోలీసు భద్రత వెనక్కు తీసుకున్నారు. రాష్ట్రంలో పలు పార్టీలకు చెందిన ప్రముఖ నేతల ఇళ్లకు పోలీసు భద్రత కల్పిస్తున్నారు. వారి ఇళ్ల ముందు సాయుధదళ పోలీసులు పగలు, రాత్రి భద్రతా విధుల్లో పాల్గొంటున్నారు. రాజకీయ ప్రాముఖ్యం, ముప్పు, వ్యక్తిగత డిమాండ్లు తదితర ఆధారంగా ఈ భద్రతను ప్రభుత్వం కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో, డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయకాంత్, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు సెల్వపెరుందగై తదితర ముగ్గురు ఇళ్లకు ఏర్పాటు చేసిన పోలీసు భద్రత వెనక్కు తీసుకున్నారు. ముగ్గురు ఇళ్ల వద్ద ఐదుగురు సాయుధ పోలీసులు భద్రతా విధులు నిర్వహిస్తున్నారు. వారికి ప్రాణహాని ఉన్నట్లయితే మళ్లీ భద్రత కల్పిస్తామని పోలీసు శాఖ తరపున వివరణ ఇచ్చింది.

దక్షిణ రైల్వే పథకాలకు రూ.6362 కోట్లు

● కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

ప్యారీస్, ఆగస్టు 20: దక్షిణ రైల్వే పరిధిలో సాగే అభివృద్ధి పనులకు రూ.6362 కోట్లను అందజేసినట్టు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో తమిళనాడుకు తగినన్ని నిధులు కేటాయించలేదనీ, ముఖ్యంగా రైల్వే పథకాల గురించి ప్రస్తావించలేదంటూ సీఎం స్టాలిన్ ఆరోపించిన విషయం తెల్సిందే. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి.. దక్షిణ రైల్వే పథకాలకు అవసరమైన నిధులను కేంద్రప్రభుత్వం అందజేసిందని, గత కాంగ్రెస్ ప్రభుత్వం కంటే ఏడు శాతం అధికంగా నిధులు మంజూరు చేసినట్టు ఆయన మంగళవారం విడుదల చేసిన ఓ పత్రికా ప్రటనలో తెలిపారు.

వ్యాసార్ చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభం



ట్రస్ట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నిర్వాహకులు

అడయార్, ఆగస్టు 20: నగరంలో వ్యాసార్ చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభించారు. ఈ ట్రస్ట్ ప్రారంభోత్సవాలు సోమవారం రాత్రి జరిగాయి. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.ఈ కార్యక్రమానికి చారిటబుల్ మేనేజింగ్ ట్రస్టీ కె.మాణిక్యం నాయకత్వం వహించగా, చైర్మన్ జీపీ సామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక సంచికను ప్రముఖ రచిత సంఘ దేశీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ కొ.పెరియణ్ణన్ స్వీకరించారు. అలాగే, సినీ దర్శకుడు సూరజ్, ట్రస్ట్ నిర్వాహకులు రవికుమార్, రాజా, ధర్మరాజ్, మురుగన్, విజయలక్ష్మి, సహదేవన్, గజేంద్రన్‌తో పాటు నేషనల్ రైటర్స్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఇదయ గీతం రామానుజం తదితరులు పాల్గొని ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు.

మెట్రో రైల్వేస్టేషన్ల పార్కింగ్ ప్రాంతాల్లో పైకప్పు

పెరంబూర్, ఆగస్టు 20: మెట్రో రైల్వేస్టేషన్లలో ఉన్న పార్కింగ్ ప్రాంతాల్లో పైకప్పు ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన కేసులో 12 వారాల్లో పరిశీలించి చర్యలు చేపట్టాలని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్)కు మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. పైకప్పు లేకపోవడంతో ఎండకు, వానలకు వాహనాలు దెబ్బతింటున్నాయని నగరానికి చెందిన జ్ఞానేశ్వరన్ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు.

బాలికను గర్భిణిని చేసిన పూజారికి 20 ఏళ్ల జైలు

ప్యారీస్, ఆగస్టు 20: పద్నాలుగేళ్ల బాలికను గర్భిణిని చేసిన పూజారికి తిరుప్పూర్ మహిళా కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించింది. ఆలయ పూజారి 2021వ సంవత్సరం ఆలయానికి వచ్చిన బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో, బాలిక గర్భం దాల్చినట్లు ఆమె తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద అరెస్టయిన అయ్యప్పన్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

సేలం రైల్వే డివిజన్‌లో క్యూ ఆర్ కోడ్ ద్వారా టిక్కెట్లు


ప్యారీస్, ఆగస్టు 20: సేలం రైల్వే డివిజన్‌లో ఉన్న 78 రైల్వేస్టేషన్లలో క్యూ ఆర్ కోడ్ ద్వారా ప్రయాణికులు టిక్కెట్లు పొందే వసతి అందుబాటులోకి వచ్చింది. దేశవ్యాప్తంగా డిజిటల్ నగదు పరివర్తన ద్వారా వాణిజ్యం నిర్వహించేలా కేంద్రప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా రైల్వే శాఖలో ప్రయాణికుల సౌకర్యార్థం క్యూ ఆర్ కోడ్ విధానంలో టిక్కెట్లు పొందే సౌకర్యం కల్పించింది. ఈ విధానం సేలం రైల్వే డివిజన్‌లో అమల్లోకి వచ్చింది. ఈ డివిజన్ పరిధిలో ఉన్న ఈరోడ్, తిరుప్పూర్, కోవై, కరూర్, సేలం టౌన్, మేట్టుపాళయం, ఊటీ సహా 78 రైల్వేస్టేషన్లలో ఏర్పాటుచేసిన ఆధునిక పరికరం ద్వారా ప్రయాణికులు పీహెచ్‌ఐఎం, పేటీఎం, జీపే, ఫోన్‌పే, బ్యాంక్ వాట్సాప్ తదితర డిజిటల్ నగదు పరివర్తన ద్వారా టిక్కెట్లు పొందవచ్చని అధికారులు తెలిపారు.

ముగ్గురు ఐఏఎస్ అధికారులకు పదోన్నతి

ప్యారీస్, ఆగస్టు 20: ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రత్యేక కార్యదర్శులుగా నియమితులైన ముగ్గురు ఐఏఎస్ అధికారులకు రాష్ట్రప్రభుత్వం పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం ప్రత్యేక కార్యదర్శులుగా మురుగానందం, ఉమానాథ్, షణ్ముగం, అను జార్జి వ్యవహరించారు. ఈ నేపథ్యంలో, వీరిలో మురుగానందాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో సీఎం ప్రత్యేక కార్యదర్శులను సీఎస్ మార్పు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక నుంచి ముగ్గురు ఐఏఎస్ అధికారులు ఉమానాథ్, ఎమ్మెస్ షణ్ముగం, అను జార్జి పదోన్నతి పొందినట్లు సచివాలయం ప్రకటించింది.

మంత్రి పెరియస్వామి కేసులో 27న అభియోగాల నమోదు

పెరంబూర్, ఆగస్టు 20: ఇళ్ల స్థలాల కేటాయింపులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై మంత్రి ఐ.పెరియస్వామిపై దాఖలైన కేసులో ఈ నెల 27న అభియోగాలు నమోదు చేస్తామని చెన్నై ప్రత్యేక న్యాయస్థానం ప్రకటించింది. 2008లో ఐపీఎస్ అధికారి జాఫర్‌సేట్ భార్య పర్వీన్ సహా కొందరికి స్థానిక తిరువాన్మియూర్‌లో 3,457 చదరపు అడుగులు, 4,763 చ.అ ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ స్థలంలో అపార్ట్‌మెంట్లు నిర్మించి కోట్ల రూపాయల ఆదాయం పొందారని అప్పటి హౌసింగ్ బోర్డు మంత్రిగా వ్యవహరించిన ప్రస్తుత మంత్రి ఐ.పెరియస్వామి, జాఫర్ సేట్, ఆయన భార్య పర్వీనా, కె.మురుగయ్య, కె.రాజమాణిక్యం, ఆర్.దుర్గ శంకర్ తదితర ఏడుగురిపై అవినీతి నిరోధక శాఖ 2013లో కేసు నమోదు చేసింది. ఈ కేసులో మంత్రి పెరియస్వామి మినహా మిగిలిన కొందరిని విడుదల చేస్తూ, మరికొందరిపై ఉన్న కేసు రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. మంత్రి ఐ.పెరియస్వామికు వ్యతిరేకంగా దాఖలైన కేసును స్థానిక మద్రాసు హైకోర్టు ప్రాంగణంలోని ఎంపీ, ఎమ్మెల్యేపై మోపిన కేసులు విచారిస్తున్న ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.జయవేల్ మంగళవారం విచారించారు. ఈ సమయంలో, మంత్రి పెరియస్వామి తరపున నేరుగా హాజరకావడంపై మినహాయింపు ఇవ్వాలని పిటిషన్ దాఖలైంది. మంత్రి తరపు వాదన పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి, ఈ కేసులో ఛార్జిషీటు దాఖలును ఈ నెల 27కు వాయిదా వేస్తూ, ఆ రోజున మంత్రి పెరియస్వామి నేరుగా హాజరుకావాలని న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.



మంత్రి పెరియస్వామి

కనకసభ నుంచే నటరాజ స్వామి దర్శనం

ప్యారీస్, ఆగస్టు 20: కడలూరు జిల్లా చిదంబరంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన నటరాజస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కనకసభ పై నిలబడి భక్తులు స్వామిని దర్శించుకోవచ్చని మద్రాసు హైకోర్టు తీర్పు వెలువరించింది. ఈ ఆలయానికి తరచూ వెళ్తున్న సంబంధమూర్తి అనే భక్తుడు ప్రధాన దీక్షితులకు వ్యతిరేకంగా హైకోర్టులో పిటిషన్ వేశారు. అందులో కనకసభ నుంచి భక్తులను దర్శనం చేసుకోకుండా దీక్షితులు అడ్డుకుంటున్నారని, ఈ వ్యవహారంలో విచారణ జరపాలని కోరారు. మంగళవారం ఈ పిటిషన్ విచారణకు రాగా, పిటిషనర్ తరపు న్యాయవాది తమ వాదనలు వినిపించారు. అనంతరం ఆలయంలో నిర్వహించే ఆరు జాము పూజలు మినహాయించి ఆణి తిరుమంజనం వేడుకలు, ఇతర పూజల్లో భక్తులు కనకసభ ద్వారా దర్శనం చేసుకొనేందుకు అనుమతించిన న్యాయస్థానం, సంబంధమూర్తి పిటిషన్‌కు ముక్తాయింపు పలికింది.

రూ.2 వేలు లంచం

● అధికారికి 4 యేళ్ళ జైలు ● తిరువళ్లూరు కోర్టు తీర్పు

అడయార్, ఆగస్టు 20: విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు రూ.2 వేలు లంచం తీసుకున్న ఉద్యోగికి నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ తిరువళ్లూరు జిల్లా కోర్టు తీర్పునిచ్చింది. జిల్లాలోని అయప్పాక్కానికి చెందిన జయకుమార్ 2014లో తాను నిర్మించుకున్న కొత్త ఇంటికి విద్యుత్ కనెక్షన్ కోరుతూ విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. కనెక్షన్ ఇచ్చేందుకు రూ.2 వేలు లంచం ఇవ్వాలంటూ ఏఈ సుకుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జయకుమార్ జిల్లా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు... రూ.2 వేలు లంచం తీసుకుంటుండగా సుకుమార్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసు విచారణ తిరువళ్లూరు జిల్లా ప్రత్యేక కోర్టులో సాగింది. కేసును విచారించిన న్యాయమూర్తి మోహన్.. సుకుమార్‌ను దోషిగా తేల్చి, నాలుగేళ్ల జైలుశిక్షతో పాటు లంచం అడిగినందుకు, లంచం తీసుకున్న నేరాలకు సంబంధించి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.20 వేలు అపరాధం విధిస్తూ తీర్పునిచ్చారు. దీంతో సుకుమార్‌ను స్థానిక పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు.

జైపూర్ నుంచి వచ్చిన 1.5 టన్నుల మాంసం స్వాధీనం

అడయార్, ఆగస్టు 20: రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ నుంచి రైలులో చెన్నైకు వచ్చిన 1.50 టన్నుల మాంసాన్ని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎగ్మోరుకు వచ్చిన ఒక రైలులో వచ్చిన పార్శిళ్ళను రైల్వే అధికారులు తనిఖీ చేశారు. ఇందులో కొన్ని పార్శిళ్ళలో పశుమాంసం ఉన్నట్టు గుర్తించారు. ఇందులో మూడు రోజుల క్రితం సిద్ధం చేసిన వేట మాంసంతో పాటు పశుమాంసం కూడా ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. జైపూర్ నుంచి ఈ పార్శిల్‌ను పంపించిన వారు ఎవరన్నదానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.



ప్రైవేటు పాఠశాలలకు నిబంధనలు

ప్యారీస్, ఆగస్టు 20: విద్యార్థినిపై నామ్ తమిళర్ పార్టీ నిర్వాహకుడు కావేరీపట్టణానికి చెందిన శివరామన్ అఘాయిత్యానికి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ కేసులో నిందితుడితో పాటు అతని మిత్రుడు, ఉపాధ్యాయురాలు సహా మరో ముగ్గురిని అరెస్టు చేశారు. వీరిని విచారించిన పోలీసులు పలు పాఠశాలల్లో విద్యార్థినులపై అత్యాచారం జరిగినట్టు తెలిసింది. దీంతో అప్రమత్తమైన పాఠశాల విద్యాశాఖ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు, టీచర్లకు కొత్త నిబంధనలు విధించింది. ప్రత్యేక శిక్షణ పేరుతో పాఠశాలల్లో శిబిరాలు నిర్వహణకు ఆయా జిల్లాల విద్యా శాఖ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అనుమతి పొందాలన్న షరతు విధించింది.

● వేంగైవాయల్ వ్యవహారం

మళ్లీ గడువు కోరిన సీబీసీఐడీ

పెరంబూర్, ఆగస్టు 20: వేంగైవాయల్ వ్యవహారంలో ఛార్జీషీటు దాఖలుకు మరో నెల అవకాశం కల్పించాలని సీబీసీఐడీ తరఫున పిటిషన్ దాఖలైంది. పుదుకోట జిల్లా వేంగైవాయల్ గ్రామంలోని దళితుల కాలనీలో 2022 డిసెంబరు 26న పలువురు చిన్నారులు అనారోగ్యానికి గురయ్యారు. ఈ వ్యవహారంపై అధికారులు చేపట్టిన విచారణలో, కాలనీకి తాగునీరు అందించే ఓవర్‌హెడ్ ట్యాంక్‌లో మానవ వ్యర్థాలు కలిసినట్లు, ఈ నీరు తాగిన చిన్నారులు అనారోగ్యానికి గురయ్యారని తెలిసింది. ఈ వ్యవహారంపై సీబీసీఐడీ పోలీసులు విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో, ఈ వ్యవహారాన్ని సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరుతూ న్యాయవాదులు మార్క్స్ రవీంద్రన్, రాజ్‌కమల్‌లు మద్రాసు హైకోర్టు ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ కేసు మంగళవారం విచారణకు రాగా, ఘటన జరిగిన రెండేళ్లు దాటినా పోలీసులు ఒక్కరిని కూడా ఎందుకు అరెస్ట్ చేయలేదు? మానవతా దృక్పథంతో తాగునీటి ట్యాంకులో మానవ వ్యర్థాలు కలిగిన వ్యవహారంపై నివేదిక మాత్రం పరిగణలోకి తీసుకోమని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో, ఛార్జీషీటు దాఖలుకు మరో నెలరోజులు అవకాశం కల్పించాలని పుదుకోట అంటరానితనం నిర్మూలన న్యాయస్థానంలో సీబీసీఐడీ పోలీసులు పిటిషన్ దాఖలుచేశారు.

సంబల్‌పూర్ - ఈరోడ్ ప్రత్యేక రైలు

పెరంబూర్, ఆగస్టు 20: ప్రయాణికుల సౌకర్యార్థం సంబల్‌పూర్ - ఈరోడ్ - సంబల్‌పూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే పేర్కొంది. నెం.08311 సంబల్‌పూర్ - ఈరోడ్ ప్రత్యేక రైలు ఈ నెల 21, 28, సెప్టెంబరు 4, 11, 18, 25, అక్టోబరు 2, 9, 16, 23, 30, నవంబరు 6, 13, 20, 27 తేదీల్లో సంబల్‌పూర్‌లో ఉదయం 11.35 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 8.30 గంటలకు ఈరోడ్ చేరుకుంటుంది. మరోమార్గంలో నెం.08312 ఈరోడ్ - సంబల్‌పూర్ ప్రత్యేక రైలు ఈ నెల 23, 30, సెప్టెంబరు 6, 13, 20, 27, అక్టోబరు 4, 11, 18, 25, నవంబరు 1, 8, 15, 22 తేదీల్లో ఈరోడ్‌లో మధ్యాహ్నం 2.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.15 గంటలకు సంబల్‌పూర్ చేరుకుంటుంది. ఈ రైళ్లు విజయనగరం, రాజమండ్రి, విజయవాడ, గూడూరు, పెరంబూర్, కాట్పాడి, జోలార్‌పేట మీదుగా రాకపోకలు సాగిస్తాయని అధికారులు తెలిపారు.

తేయాకు తోటలో పిల్ల సహా పులి మృతి

పెరంబూర్, ఆగస్టు 20: నీలగిరి జిల్లా పందలూరు తాలూకా ముక్కటి ప్రాంతంలోని తేయాకు తోటలో పిల్ల సహా ఆడపులి మృతి చెందింది. తేయాకు కార్మికులు అందజేసిన సమాచారంతో అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకొని విచారణ చేపట్టారు. రెండు కళేబరాల్లో గాయాలు లేకపోవడంతో పోస్టుమార్టం నివేదిక అనంతరం పులుల మృతికి కారణాలు తెలుస్తాయని అధికారులు తెలిపారు.

వాణిజ్య కాంప్లెక్స్‌కు బాంబు బెదిరింపు

ఐసిఎఫ్, ఆగస్టు 20: స్థానిక రాయపేటలో ఉన్న ఎక్స్‌ప్రెస్ అవెన్యూ షాపింగ్ మాల్‌కు బాంబు బెదిరింపు వచ్చింది. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ కాంప్లెక్స్ వచ్చిన ఈ-మెయిల్‌లో షాపింగ్ మాల్‌లో బాంబు ఉందని, అది ఏ సమయంలోనైనా పేలుతుందని, ఈ చర్యలకు కేఎస్ఆర్ గ్రూప్ బాధ్యత వహిస్తుందని ఉంది. ఈ విషయమై నిర్వాహకులు అన్నాసాలై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది, జాగిలాలతో వెళ్లి పరిశీలించారు. అక్కడ ఎలాంటి పేలుడు పదార్థం లభించకపోవడంతో వదంతిగా తెలిసింది. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు.

విద్యార్థులకు గంజాయి చాక్లెట్ల విక్రయం ఒకరి అరెస్ట్

ఐసిఎఫ్, ఆగస్టు 20: విద్యార్థులకు గంజాయి చాక్లెట్లు విక్రయించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక ఎల్ఐసీ మెట్రో రైల్వేస్టేషన్‌లో ఆదివారం రాత్రి ప్రయాణికుల లగేజీలను స్కానింగ్ చేస్తున్న సమయంలో ఓ యువకుడి సంచిలో అనుమానాస్పద వస్తువులున్నట్లు గుర్తించారు. బ్యాగు తనిఖీ చేయగా 19 గంజాయి చాక్లెట్లు ఉన్నట్లు గుర్తించి అన్నాసాలై పోలీసులకు అప్పగించారు. విచారణలో... షోలింగనల్లూర్‌కు చెందిన 21 ఏళ్ల యువకుడు ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నట్లు తెలిసింది. ఆ యువకుడి సమాచారం మేరకు గంజాయి చాక్లెట్లు సరఫరా చేసిన ఉత్తర ప్రదేశ్‌కు చెందిన రాజేష్‌ను సోమవారం అరెస్ట్ చేశారు. వారు విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని ఈ చాక్లెట్లు విక్రయిస్తున్నట్లు తెలిసింది.

కోర్టు ప్రాంగణంలో బ్యాటరీ చోరీ న్యాయవాది అరెస్ట్

ఐసిఎఫ్, ఆగస్టు 20: కోర్టు ప్రాంగణంలో బ్యాటరీ చోరీ చేసిన న్యాయవాదిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరునల్వేలి జిల్లా వల్లియూర్ కోర్టు ప్రాంగణంలో జనరేటర్ ఉంది. కొన్ని రోజుల క్రితం జనరేటర్‌ను ఆన్ చేయగా పని చేయలేదు. అందులో ఉన్న బ్యాటరీ చోరీకి గురైనట్టు గుర్తించిన కోర్టు సిబ్బంది, వల్లియూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన పోలీసులు, కోర్టు ప్రాంగణంలోని సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించి, బ్యాటరీ చోరీకి పాల్పడిన న్యాయవాది మురుగన్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

వైభవంగా పచ్చయమ్మాల్ ఆలయ వేడుకలు

వేలూరు, ఆగస్టు 20: కీల్‌అరసమ్‌పట్టు నాగ నది తీరంలో కొలువై ఉన్న పచ్చయమ్మాల్ ఆలయ 68వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. వేడుకల్లో భాగంగా తెల్లవారుజామున ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేక ఆరాధనలు, ప్రత్యేక అలంకరణ చేసి దీపారాధనలు చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వేడుకల్లో భాగంగా రూ.45 వేల విలువైన కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.



ప్రత్యేక అలంకరణలో పచ్చయమ్మాల్ అమ్మవారు

తొరప్పాడిలో వెటర్నరీ ఆస్పత్రి ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఆగస్టు 20: తొరప్పాడి వెటర్నరీ ఆస్పత్రి భవనాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. నాబార్డు నిధులు రూ.3 కోట్లతో ఈ ఆస్పత్రి భవన నిర్మాణాలు చేపట్టారు. చెన్నై సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పాల్గొని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆస్పత్రి భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రిలో కలెక్టర్ సుబ్బులక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్తికేయన్, కార్పొరేషన్ మేయర్ సుజాత ఆనందకుమార్, కార్పొరేషన్ కమిషనర్ జానకి రామచంద్రన్, వెటర్నరీ శాఖ జాయింట్ డైరెక్టర్ గోపికృష్ణన్, అసిస్టెంట్ డైరెక్టర్ అంధుమణి, పీడబ్ల్యూడీ అసిస్టెంట్ ఇంజనీర్ పడవేట్టాన్, 4వ మండల అధ్యక్షుడు వెంకటేశన్ సహా పలువురు పాల్గొన్నారు.

సిలంబం విజేతలకు ఘనస్వాగతం



విజేతలకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

వేలూరు, ఆగస్టు 20: సిలంబం విజేతలకు ఘనంగా స్వాగతం పలికారు. బెంగళూరులో ఇటీవల సిలంబం (కర్రసాము) పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 1,000 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గుడియాత్తానికి చెందిన ఇద్దరు విద్యార్థులు బహుమతులు సాధించారు. సభాపతి దివాకర్ సూపర్ సీనియర్ విభాగంలో మొదటి బహుమతి, సుకుమార్ నితీష్ జూనియర్ విభాగంలో మొదటి బహుమతి సాధించారు. వీరిద్దరు మంగళవారం స్వగ్రామానికి చేరుకోగా, ఏరతాంగల్ వాగై స్పోర్ట్స్ నిర్వాహకులు, గ్రామ పెద్దలు పూలదండలు వేసి ఘనస్వాగతం పలికారు.

ఐఐఎఫ్‌సీలో కొత్తగా బీఎస్సీ ఫిల్మ్ స్టడీస్ కోర్సు

● ఘనంగా ద్వితీయ వార్షికోత్సవం



వేదికపై విజయ్ సేతుపతి, వెట్రిమారన్, ఎస్.థాను తదితరులు

ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ స్థాపించిన 'ది ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిల్మ్ అండ్ కల్చర్ (ఐఐఎఫ్‌సీ)' విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకుని తృతీయ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా ఈ ఇనిస్టిట్యూట్‌లో కొత్తగా బీఎస్సీ ఫిల్మ్ స్టడీస్, పీజీ డిప్లొమా ఇన్ ఫిల్మ్ డైరెక్షన్ ప్రోగ్రామ్ కోర్సును ప్రవేశపెట్టింది. ఈ రెండు కోర్సులను ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి, ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్.థాను ప్రారంభించారు. 2022లో దర్శకుడు వెట్రిమారన్ ఈ సంస్థను ఏర్పాటు చేశారు. నిరుపేద నేపథ్యం కలిగి చిత్ర పరిశ్రమలో రాణించాలనే ఔత్సాహిక యువతకు సాధికారత కల్పించేందుకు సంస్థను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మూడో సంవత్సరంలోకి అడుగిడిన సందర్భంగా కొత్త ఈ కోర్సుల ప్రారంభోత్సవం ఆదివారం వేళచ్చేరిలోని ఐఐఎఫ్‌సీలో జరిగింది. ప్రొఫెసర్ రాజనాయగం, వేల్స్ విశ్వవిద్యాలయం విజ్యువల్ కమ్యూనికేషన్ విభాగాధిపతి ఎస్ఎం వళర్మతి, లయోలా కాలేజీ ప్రొఫెసర్ రాజనాయగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందరక్భంగా విజయ్ సేతుపతి మాట్లాడుతూ... వెట్రిమారన్ దార్శనికతను మెచ్చుకుంటూ ఈ అవకాశాన్ని ఔత్సాహిక యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కలైపులి ఎస్.థాను మాట్లాడుతూ... ఈ సంస్థ అభివృద్ధికి తన మద్దతుతో పాటు సహాయ సహకారాలు ఉంటాయని, సినిమా రంగం అభివృద్ధికి కృషి చేస్తున్న వెట్రిమారన్‌ను అభినందనీయుడన్నారు.

విజయకాంత్ ఆశీస్సులతో 'ది గోట్'

● హీరో విజయ్

దివంగత నటుడు కెప్టెన్ విజయకాంత్ కుటుంబ సభ్యులను అగ్ర హీరో విజయ్ సోమవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కెప్టెన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కెప్టెన్ సతీమణి ప్రేమలత, వారి ఇద్దరు కుమారులు విజయ్ ప్రభాకరన్, షణ్ముగపాండ్యన్‌ను కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. వెంకట్ ప్రభు దర్శకత్వంలో తాను హీరోగా నటించిన 'ది గోట్' చిత్రంలో విజయకాంత్‌ను ఆర్టిఫిషియల్ టెక్నాలజీ (ఏఐ)తో ఉపయోగించుకునేందుకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో కెప్టెన్ కుటుంబానికి విజయ్ ధన్యవాదాలు చెప్పినట్టు సమాచారం. స్థానిక సాలిగ్రామంలోని విజయకాంత్ నివాసంలో ఈ సమావేశం జరిగింది. విజయ్ వెంట చిత్ర దర్శకుడు వెంకట్ ప్రభు, నిర్మాతల్లో ఒకరైన అర్చన కల్పాతి ఉన్నారు. ఈ సందర్భంగా విజయ్ తన ఎక్స్ ఖాతాలో 'విజయకాంత్ ఆశీస్సులతో 'ది గోట్' అంటూ ట్వీట్ చేశారు.



విజయకాంత్ కుటుంబ సభ్యులతో విజయ్, వెంకట్ ప్రభు, అర్చన

చిత్రజ్యోతి

నా అంతిమ కన్నీరు 'వాళై'

● దర్శకుడు మారి సెల్వరాజ్

'వాళై' చిత్రం తన అంతిమ కన్నీరు అని ఆ చిత్ర దర్శకుడు మారిసెల్వరాజ్ అన్నారు. 'అతనికి ఏంటి సమస్య? అని ప్రశ్నించేవారికి, తన గురించి ఆలోచించే వారికి తాను చెబుతున్న సమాధానమే ఈ చిత్రం అని ఆయన పేర్కొన్నారు. డిస్నీ ప్లస్ హాట్‌స్టార్, నవి స్టూడియోస్, ఫార్మర్స్ మాస్టర్ ప్లాన్ ప్రొడక్షన్స్ కంపెనీలు సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'వాళై'. రెడ్ జెయింట్ మూవీస్ ఈనెల 23వ తేదీన విడుదల చేయనుంది. పొన్‌వేల్, రాహుల్, కలైయరసన్, నిఖిలా విమల్, సతీష్‌కుమార్, దివ్య దురైస్వామి, జానకి తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా తేని ఈశ్వర్, ఎడిటింగ్ సూర్య ప్రధానమన్, సంగీతం సంతోష్ నారాయణన్. ఈ చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్ సోమవారం రాత్రి చెన్నైలో జరిగింది. ఇందులో చిత్రపరిశ్రమకు చెందిన వెట్రిమారన్, పా.రంజిత్, మిష్కిన్, శశి, నెల్సన్ దిలీప్ కుమార్, అమీర్, నటులు శరత్ కుమార్, హరీష్ కళ్యాణ్, సూరి, నిర్మాత కలైపులి ఎస్.థాను సహా పలువురు సినీ దర్శకులు, నిర్మాతలు, నటీనటులు హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు చెప్పారు. ఇందులో చిత్ర దర్శకుడు మారి సెల్వరాజ్ మాట్లాడుతూ, 'ఇకపై నేను మంచి చిత్రాలను తెరకెక్కించినప్పటికీ నా కెరీర్‌లో ది బెస్ట్ మూవీగా 'వాళై' సినిమానే చెప్పుకుంటా. నా అంతిమ కన్నీరు ఏది అంటే అది 'వాళై' మాత్రమే. వీటి సమస్య ఏంటి అని ప్రశ్నించే వారందరికీ ఈ సినిమానే సమాధానం. నా బాధను, ఏడుపును నా దర్శకుడు రామ్‌కు చెబుతుండగా, అదే కళ అని గ్రహించాను. అందుకే అతనికి ఈ సినిమాను అంకితం చేస్తున్నా' అని పేర్కొన్నారు.



కలర్‌ఫుల్‌గా గణేశుడు

ముమ్మరంగా వినాయక ప్రతిమల తయారీ పనులు

పెరంబూర్, ఆగస్టు 20: పిల్లలు, యువకులు, పెద్దలందరూ సంతోషంగా, కోలాహలంగా జరుపుకొనే 'వినాయక చవితి' సెప్టెంబరు 7వ తేది రానుంది. ఈ పండుగ సందర్భంగా తమ ఇళ్లలో చిన్న సైజు వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసి పూజలు చేస్తుంటారు. ఇక, యువకులు తమ వీధుల్లో పందిళ్లు ఏర్పాటు చేసి, వేదికపై భారీ వినాయక ప్రతిమలు ఏర్పాటుచేసి పూజలు నిర్వహించిన తర్వాత మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని జలాశయాల్లో నిమజ్జనం చేస్తుంటారు. పండుగకు ఇంకా పదిహేను రోజులు మాత్రమే ఉండడంతో ప్రతిమల తయారీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. చవితి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు లక్ష ప్రాంతాల్లో ప్రతిమలను ప్రతిష్ఠించేందుకు హిందూ సంస్థలు సన్నద్ధమవుతున్నాయి.

మూడు నెలల నుంచే తయారీ పనులు...

వినాయక ప్రతిమల తయారీని అధికంగా ఉత్తరాదివాసులు చేపడుతుంటారు. మూడు నెలల ముందుగానే నగర శివారు ప్రాంతాలు, ముఖ్యమైన చిన్న నగరాల్లో షెడ్లు ఏర్పాటు చేసుకొని ప్రతిమల తయారీ ప్రారంభిస్తారు. బంక మట్టిని ఎండలో ఆరబెడుతారు. అనంతరం వినాయక ప్రతిమ నమూనాతో చేసిన పెట్టెలో మట్టి, వెదురు దుంపలు, కాగితపు గుజ్జు కలిపి వేస్తారు. పదిహేను రోజుల అనంతరం పెట్టె నుంచి ప్రతిమలు తీసి ఆరబెడతారు. అనంతరం వాటికి రంగులు వేసి ప్రతిమను పూర్తిచేస్తారు. పర్యావరణానికి హాని కలిగించేలా రసాయన పూత ప్రతిమలు తయారు చేయరాదనే ప్రభుత్వ నిబంధనలతో, నీటిలో త్వరగా కలిసిపోయేలా బంక మట్టితో విగ్రహాలు రూపొందుతున్నాయి. అదే సమయంలో వినాయకుడి వాహనం మూషికంతో కూడిన ప్రతిమలు, ఏనుగు, సింహం సహా పలు జంతువులపై కూర్చున్న వినాయకుడు, ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగా సూపర్ మ్యాన్ వినాయకుడు, క్రికెట్ ఆడుతున్న వినాయకుడు సహా పలు రకాల్లో ప్రతిమలు రూపుదిద్దుకుంటున్నాయి.



భారీ ప్రతిమలు







గణపయ్య ప్రతిమలకు రంగులు అద్దుతున్న కళాకారులు

కఠిన నిబంధనలు...

ఈ ఏడాది విగ్రహాల ఏర్పాటుకు పోలీసు శాఖ పలు నిబంధనలు విధించింది. 10 అడుగుల ఎత్తుకు పైగా విగ్రహాలు ఉంచరాదని, వీధుల్లో ఏర్పాటుచేసే విగ్రహాలకు జిల్లా అధికారుల అనుమతి, విగ్రహాలు ప్రతిష్ఠించే పందిళ్ల వద్ద లౌడ్ స్పీకర్ ఏర్పాటుకు పోలీసు శాఖ అనుమతి, ప్రైవేటు స్థలం అయితే సదరు యజమాని అంగీకార పత్రం తదితరాలు పొందాల్సి ఉంటుంది. అలాగే, చర్చి మసీదుల వద్ద వినాయక విగ్రహాలు ఏర్పాటుచేయరాదని, ఇతర మతాలు, వర్గాలను కించపరిచేలా పాటలు, నినాదాలు ఉండరాదని సూచించింది. అలాగే, పోలీసు శాఖ సూచించిన ప్రదేశంలోనే నిమజ్జనం చేయాలని, ఊరేగింపులు సైతం సూచించిన మార్గంలోనే వెళ్లాలని సూచించింది.

వైద్యచికిత్సలకు రోబోటిక్ యంత్రం





మీడియాతో మాట్లాడుతున్న సీఎంసీ ఆస్పత్రి, ఐఐటీ చెన్నై నిర్వాహకులు - పరిచయం చేసిన రోబోటిక్ యంత్రం

వేలూరు, ఆగస్టు 20: స్థానిక సీఎంసీ వైద్యశాల, చెన్నై ఐఐటీ సహకారంతో వైద్యచికిత్సల కోసం రోబోటిక్ యంత్రాన్ని తయారుచేశారు. ఈ విషయమై సీఎంసీ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ విక్రమ్ మెహదీవ్, ప్రొఫెసర్ మనుసంతానం, ఐఐటీ చెన్నై నిర్వాహకులు సంయుక్తంగా విలేకరులతో మాట్లాడారు. చేతుల నరాలు మార్పిడికి ఈ రోబోటిక్ యంత్రం వినియోగించనున్నామన్నారు. సీఎంసీ బయో ఇంజనీరింగ్ విభాగ లెక్చరర్లు శివకుమార్, బాలసుబ్రమణ్యం, ఐఐటీ చెన్నై మెకానికల్ ఇంజనీరింగ్ విభాగ ప్రొఫెసర్ శ్రీనివాసన్ తదితరులు ఈ యంత్రం పనితీరును వివరించారు.

మేమూ బాడీ బిల్డర్లమే...!

● పోటీలో ఆకట్టుకున్న చిన్నారులు



పోటీల్లో దేహదారుఢ్యం చూపుతున్న చిన్నారులు

పెరంబూర్, ఆగస్టు 20: రామనాథపురం జిల్లా తిరువాడనై సమీపం తొండిలో రామనాథ పురం జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 21వ 'మిస్టర్ రామ్‌నాడు' పోటీలు జరిగాయి. ఈ పోటీలను యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ జిల్లా అధికారి దినేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ పోటీల్లో 10 ఏళ్లలోపు చిన్నారులు పాల్గొని, తమ దేహదారుఢ్యాన్ని ప్రదర్శిస్తూ పలు విన్యాసాలు చేశారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారందరికీ పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

భారతీయ విద్యార్థులకు

ఆక్స్‌ఫర్డ్ ఇంటర్నేషనల్ చేయూత

అడయార్, ఆగస్టు 20: బ్రిటన్‌లో ఉన్నత విద్యను అభ్యసించాలని భావించే భారతీయ విద్యార్థులకు అవసరమైన చేయూత అందించేందుకు ఆక్స్‌ఫర్డ్ ఇంటర్నేషనల్ ముందుకు వచ్చి ఒక పాథ్‌వే ప్రోగ్రామ్‌ను అమలుచేయనుంది. ఇటీవల యూకేలో ఉన్నత విద్యను అభ్యసించే భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇలాంటి వారికి సాయం చేసేందుకు అంతర్జాతీయ విద్యారంగంలో అగ్రగామిగా ఉన్న ఆక్స్‌ఫర్డ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ గ్రూప్.. భారతీయ విద్యార్థుల ఆకాంక్షలను నెరవేర్చేలా రీడిజైన్డ్ పాథ్‌వే ప్రోగ్రాంను ప్రవేశపెట్టింది. ఈ ఇంటిగ్రేటెడ్ పాథ్‌వే ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు అన్ని విధాలా సహకరించడం, ఉపాధి అవకాశాలు లభించేలా అందుబాటులో ఉండే అనువైన మార్గాలను సూచించేలా సహాయపడేలా ప్రోగ్రాంను రూపొందించినట్టు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మోహిత్ గంభీర్, గ్రూప్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ యాండీ కాల్డ్‌వెల్ మంగళవారం చెన్నైలో జరిగిన విలేఖరుల సమావేశంలో వెల్లడించారు.



మీడియా సమావేశంలో మోహిత్ గంభీర్, యాండీ కాల్డ్‌వెల్

ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్‌లో హీరో నాగ చైతన్య జట్టు

అడయార్, ఆగస్టు 20: ఫార్ములా-4 ఇండియన్ చాంపియన్‌షిప్‌లో స్ట్రీట్ రేసుల కోసం తాను ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నట్టు నాగ చైతన్య పేర్కొన్నారు. ఈ నెల 24వ తేదీ నుంచి ఇండియన్ రేసింగ్ లీగ్, ఎఫ్ఐఏ ఫార్ములా-4 ఇండియన్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభంకానున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే ఆరు ప్రధాన జట్లలో టాలీవుడ్ హీరో అక్కినేని నాగచైతన్యకు చెందిన హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్ జట్టు పాలు పంచుకుంటోంది. కాగా ఫార్ములా-4 రేసింగ్ పోటీలు దేశంలో జరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ సందర్భంగా నాగచైతన్య మాట్లాడుతూ... మోటర్ స్పోర్ట్స్‌లో ఏ రూపంలో పాలుపంచుకోవాలన్న కోరిక ఇలా తీరిందన్నారు. హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్ జట్టుకు యజమాని కావడం సంతోషంగా ఉందన్నారు. భారత మోటర్ స్పోర్ట్స్ చరిత్రలో ఇండియన్ రేసింగ్ లీగ్ ప్రముఖమైనదిగా గుర్తింపు తెచ్చుకుంటుందన్న నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు. కాగా, ఈ పోటీల్లో పాల్గొనే ఆరు జట్లలో హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్ ఒక టీం కావడం గమనార్హం.



హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్ యజమానిగా అక్కినేని నాగచైతన్య



చెన్నై సచివాలయంలో మంగళవారం సీఎం స్టాలిన్‌ను కలుసుకొని నియోజకవర్గంలోని సమస్యలపై వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.కనకసభాపతి, రాష్ట్ర కార్యదర్శి సుమతి వెంకటేశన్ తదితరులు

రేషన్ షాపుల్లో

కొబ్బరి నూనె పంపిణీపై సర్వే

అడయార్, ఆగస్టు 20: రాష్ట్రంలోని రేషన్ దుకాణాల్లో ప్రజా పంపిణీ వ్యవస్థ కింద వివిధ రకాలైన కిరాణా సరకులను ప్రభుత్వం చౌకధరలకే అందిస్తున్న విషయం విదితమే. కొత్తగా కొబ్బరి నూనెను కూడా పంపిణీ చేసే అంశాన్ని పరిశీలిస్తోంది. ఇదే విషయంపై ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతోంది. సివిల్ సప్లైస్ విభాగానికి చెందిన ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ.. కేరళ రాష్ట్ర సరిహద్దు గ్రామాలకు చెందిన ప్రజలు వంట తయారీలో కొబ్బరి నూనెను వినియోగిస్తున్నారని తెలిపారు. అందువల్ల రేషన్ షాపుల్లో కొబ్బరి నూనెను సరఫరా చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని, అయితే, కొబ్బరి నూనె సరఫరాపై విధానపరమైన నిర్ణయాన్ని మాత్రం ప్రభుత్వం తీసుకోవాల్సి ఉందన్నారు.

నైవేలిలో పాఠశాల, కళాశాలలకు ఉచిత బస్సు సేవలు

చెన్నై, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నైవేలిలోని పాఠశాల, కళాశాలల విద్యార్థులందరికీ ఆర్చిగేటు, మందారకుప్పం నుంచి ఉచితంగా బస్సులు నడుపుతామంటూ ఇటీవల జరిగిన స్వాతంత్ర్యదిన వేడుకల్లో ప్రకటించిన మేరకు నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్ఎల్‌సీ) సీఎండీ ప్రసన్నకుమార్ మోటుపల్లి మంగళవారం ఆయా సేవలను ప్రారంభించారు. నైవేలి టౌన్‌షిప్‌లోని పాఠశాలల్లో, కళాశాలల్లో చదివేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాదిమంది విద్యార్థులకు నైవేలి ఆర్చిగేటు, మందారకుప్పం ప్రధాన రవాణా కేంద్రాలు. విద్యార్థులు ఆయా కేంద్రాల నుంచి తమ పాఠశాలలు, కళాశాలలకు ఎన్ఎల్‌సీ బస్సుల్లో ప్రయాణిస్తారు. వారికి రవాణా ఖర్చుల భారం నుంచి ఉపశమనం కల్పించేందుకు ఈ ఉచిత బస్సులను ప్రారంభించారు. మంగళవారం ఉదయం 9 గంటలకు నైవేలి ఆర్చిగేటు వద్ద ఉచిత బస్సు సర్వీసు ప్రారంభోత్సవం జరిగింది. ఎన్ఎల్‌సీ డైరెక్టర్ (హెచ్ఆర్) సమీర్ స్వరూప్, నైవేలి మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఫ్రాన్సిస్ సమక్షంలో ప్రసన్నకుమార్ మోటుపల్లి ఈ ఉచిత బస్సు సర్వీసులకు పచ్చజెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నైవేలి టౌన్‌షిప్ 38 విద్యాలయాలతో, 30 వేలమంది విద్యార్థులతో ఎడ్యుకేషనల్ హబ్‌గా మారిందన్నారు. ఇప్పుడు తాము ప్రారంభించిన ఉచిత బస్సు సర్వీసుల కారణంగా సుమారు 2 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



బస్సు సేవలను ప్రారంభిస్తున్న ప్రసన్నకుమార్ మోటుపల్లి తదితరులు



మంగళవారం తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో జరిగిన డాక్టర్ మాలతీచందూర్ స్మారక ధర్మనిధి సదస్సులో పాల్గొన్న ఆచార్య జక్కంపూడి మునిరత్నం, ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, ఆచార్య సి.వాణి, వల్లభనేని అశ్వనీకుమార్, ఆచార్య వైఎస్ శారద, డాక్టర్ యజ్ఞశేఖర్ తదితరులు